క్లుప్తంగా

అభివృద్ధి పనులకు భూమి పూజ



ఆటోనగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

నంద్యాల(సిటీ): పట్టణ శివారులోని ఆటోనగర్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్ మాబున్నిసా తెలిపారు. శుక్రవారం ఆటోనగర్‌లో రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఆటో నగర్ ప్రాంతాన్ని పూర్తిగా మార్చి మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఇదివరకే ఆటోనగర్‌లో నీటి సమస్య తొలగించడానికి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పైప్ లైన్, పంప్‌హౌస్ నిర్మాణంతో పాటు మినరల్ వాటర్ ప్లాంట్‌ను రూ.11.30 లక్షలతో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. 35వ వార్డు కౌన్సిలర్ బషీద్, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ జాకీర్ హుసేన్ పాల్గొన్నారు.

మొదలైన కులగణన



దొర్నిపాడులో కులగణన సర్వే నిర్వహిస్తున్న వలంటీర్లు

దొర్నిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కులగణన సర్వే మండలంలో శుక్రవారం మొదలైంది. గ్రామ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు కలిసి సంయుక్తంగా ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు. 28వ తేదీ వరకు కులగణన కొనసాగుతుందని తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి తెలిపారు. ఎలాంటి తప్పులు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని వారు సూచించారు.

రుద్రవరం: కులగణన సర్వే సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. స్థానిక బొరుగుల పేట, తెలుగుపేట, చాకలిపేట, పడమటి వీధిలో నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన సచివాలయ ఉద్యోగులకు సలహాలు,సూచనలు ఇచ్చారు.

సౌత్ ఇండియా క్రికెట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన ఓంకార్

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 23 నుంచి ఫిబ్రవరి 12వ తేదీ వరకు గోవాలో జరిగే సౌత్ ఇండియా అండర్–14 క్రికెట్ పోటీలకు నంద్యాల పట్టణంలోని ఎస్పీవై రెడ్డి పాఠశాల విద్యార్థి కేవీ ఓంకార్ ఎంపికైనట్లు నంది గ్రూప్ ఆఫ్ సంస్థ ఎండీ సుజల, పాఠశాల ప్రిన్సిపాల్ మదన్ తెలిపారు. శుక్రవారం వారు మాట్లాడుతూ గుంటూరులో ఈనెల 13, 14, 15 తేదీల్లో అండర్–14 క్రికెట్ పోటీల్లో ఓంకార్ ప్రతిభ చూపి సౌత్ ఇండియా క్రికెట్ పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. విద్యార్థిని ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు, కోచ్ ప్రసన్న అభినందించారు.

సేవా దృక్పథమే విద్యార్థులకు మణిహారం



మాట్లాడుతున్న అసోసియేట్ డీన్ నాయక్

గోస్పాడు: సేవా దృక్పథమే విద్యార్థులకు మణిహారమని మహానంది వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ నాయక్ అన్నారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో శుక్రవారం జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరాన్ని ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ సరోజినిదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామంలో వారం రోజుల పాటు అగ్రికల్చర్ బీఎస్సీ నాల్గవ సంవత్సరం విద్యార్థులు రోజువారి కార్యక్రమాలు చేపడతారని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి స్వప్నిక, వెటర్నరీ డాక్టర్ కిశోర్‌కుమార్‌రెడ్డి, ఏరువాక శాస్త్రవేత్త బాలాజీనాయక్, డాక్టర్ సంతోష్‌నాయక్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

వేతనాల బకాయి చెల్లింపునకు కృషి

నంద్యాల(సిటీ): ఇటీవల నంద్యాల పట్టణం అర్బన్‌లో కలిసిన గ్రామాలైన ఊడుమాలపురం, వెంకటేశ్వరపురం, పొన్నాపురం, రైతునగరం ప్రాంతాల సచివాలయాల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న వలంటీర్ల పెండింగ్ జీతాల చెల్లింపులకు కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయా ప్రాంతాలకు చెందిన సచివాలయ వలంటీర్లు మున్సిపల్ కమిషనర్‌ను కలిసి తమ పెండింగ్ జీతాల చెల్లించాలని కోరారు. ఆయన మాట్లాడుతూ నంద్యాల అర్బన్‌లో మెర్జ్ అయిన సచివాలయాల సెక్రటరీల జీతాలతో పాటు వలంటీర్ల జీతాలను చెల్లించేలా చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

ముమ్మరంగా జొన్న కోతలు

- ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి
- క్వింటా రూ.3,100 పలుకుతున్న ధర





ఎర్రగుడిదిన్నె వద్ద జొన్న కోత కోస్తున్న యంత్రం, పేరూరులో జొన్నలను సంచుల్లో నింపుతున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని రైతులకు ఈ ఏడాది వాతావరణం అనుకూలించింది. ఖరీఫ్,రబీ కింద సాగు చేసిన పంటలన్నీ దిగుబడులు ఆశాజనంగా వచ్చాయి. అలాగే వాటికి తగ్గట్టుగా గిట్టుబాటు ధర ఉంటుండటంతో మంచి లాభాలు గడించారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం తెలుగుగంగ కాల్వల ద్వారా సాగు నీరు అందించడంతో వరి, మొక్కజొన్న, మినుము,పత్తి, మిర్చి వంటి పంటలన్నీ అధిక దిగుబడులు లభించడంతో వారి శ్రమకు తగ్గ ఫలితం దక్కింది. రబీ సీజన్ ఆరంభం కాగానే మండలంలోని ఎర్రగుడిదిన్నె, పేరూరు, చిలకలూరు, చందలూరు,రుద్రవరం తదితర గ్రామాల పరిధిలో రైతులు వేలాది ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారు. ప్రభుత్వం తెలుగుగంగ కాల్వల ద్వారా వారబందీ పద్ధతిలో ఆరు విడతలుగా సాగు నీరు అందించింది. రైతులు జొన్న పంటకు సకాలంలో నీటి తడులు అందించారు. పంట కాలం పూర్తి కావడంతో కొద్ది రోజులు నుంచి కోతలయ్యాయి. కొందరు రైతులు కూలీల ద్వారా, మరి కొందరు యంత్రాల ద్వారా కోతలు కోయిస్తున్నారు. దిగుబడులను రోడ్లు, కళ్లాల్లో ఆరబోసి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం క్వింటా ధర రూ.3100 ప్రకారం విక్రయిస్తున్నారు. కాగా ఎకరాకు 20 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పెట్టుబడులు పోను మంచి లాభాలు చేతికందుతున్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ చర్యలతోనే పంట పండింది



రైతులు లాభాల పట్టారంటే ప్రభుత్వ చర్యలే కారణం. ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా కురవడంతో కరువు తప్పదనుకున్నాం. అలాంటి సమయంలో ప్రభుత్వం స్పందించి వార బందీ పద్ధతిలో తెలుగగంగ కాల్వల ద్వారా సాగు నీరు విడుదల చేయించింది. సాగునీరు అందుబాటులో ఉండటం, తెగుళ్ల సోకకపోవడం, వాతావరణం అనుకూలించడంతో జొన్న పంటలో మంచి దిగుబడులు వస్తున్నాయి. ఎర్రగుడిదిన్నె–పేరూరు వైపు ఐదెకరాల్లో జొన్న పంట సాగు చేశా. వంద క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. గిట్టు బాటు ధర ఉండటంతో పెట్టుబడులు పోనూ ఎకరాకు రూ.40వేల వరకు మిగులుతుంది.

– సోమశేఖర్‌రెడ్డి రైతు, ఎర్రగుడిదిన్నె

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాల్లో మెరుగైన వైద్యం



గుంప్రమాన్‌దిన్నెలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్



శ్రీరంగాపురంలో మహిళకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



ముత్యాలపాడులో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



దీబగుంట్లలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



వృద్ధురాలికి కేస్ షీట్ అందజేస్తున్న డీఎల్‌డీఓ, ఎంపీడీఓ

శిరివెళ్ల: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నిపుణులైన వైద్యులు మెరుగైన వైద్య సేవలందిస్తున్నారని వక్తలు పేర్కొన్నారు. మండలంలోని గుంప్రమాన్‌దిన్నెలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సరక్ష ఫేజ్ – 2 వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. నంద్యాలకు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లు కిరణ్, శ్రీకాంత్, కృష్ణమోహన్ రెడ్డి 502 మందికి బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేశారు. 20 మందిని ఆరోగ్యశ్రీ ఆపరేషన్లకు రెఫర్ చేశారు. సర్పంచు తలారి జానకమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు నరసింహ్మారెడ్డి, చిన్న ఉశేనిరెడ్డి, రాజారెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, ఈఓఆర్డీ నాగేంద్ర, యర్రగుంట్ల పీహెచ్‌సీ శ్రీ భవ్య పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని శ్రీరంగాపురంలో వైద్యులు శివాని, శివప్రసాదు, ప్రశాంత్ శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 435 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.గ్రామీణ ప్రాంత వాసులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

చాగలమర్రి: నిపుణులైన వైద్యులతో పల్లె ముంగిటకే వైద్యసేవలందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టిందని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి తసీం సుల్తానా తెలిపారు. మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో 1వ సచివాలయంలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో సుమారు 351 మంది వైద్య సేవలు పొందారు.ఉపిరితిత్తుల వ్యాధి నిపుణులు మౌనిక, చెవి, ముక్కు,గొంతు వ్యాధి నిపుణులు నజ్మా, జనరల్ ఫిజీషియన్ తస్లీం సుల్తానా, కంటి వైద్య సహాయకురాలు సౌజన్య వైద్య సేవలు అందించారు. 219 మందికి రక్త పరీక్షలు నిర్వహించారని టీం–2 వైద్యులు షేక్‌ఇమ్రాన్ తెలిపారు. అలాగే మెరుగైన వైద్య సేవలకు 23 మందిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రెఫర్ చేసినట్లు చెప్పారు. 52 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామన్నారు. సాగునీటి సంఘం అధ్యక్షుడు శేషురమేష్, నాయకులు రహీమాన్, చాంద్‌బాషా కాంట్రాక్టర్ సుబ్బారాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గోస్పాడు: జగనన్న సురక్షతో వైద్య శిబిరాలతో పేదల ఆరోగ్యానికి భరోసా లభిస్తుందని ఎంపీడీఓ నాగఅనసూయ, ఎంఈఓ అబ్దుల్‌కరీం పేర్కొన్నారు. మండలంలోని దీబగుంట్ల గ్రామంలో శుక్రవారం వైద్యులు గోవర్ధన్‌రెడ్డి, క్రాంతిచైతన్య, మురళీమనోహర్, జ్యోతివాణి ఆధ్వర్యంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 170 మందికి వైద్య పరీక్షలు, 42మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు.

నంద్యాల(అర్బన్): రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని అయ్యలూరు గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో 501 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డీఎల్‌డీఓ మురళీకల్యాణి, ఎంపీడీఓ సుగుణశ్రీ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. నాయకులు బసవేశ్వరరెడ్డి, రవికుమార్ రెడ్డి, వైద్య సిబ్బంది, పీఎస్ అక్బర్‌వలి పాల్గొన్నారు.

వైద్య రంగానికి పెద్దపీట

- ఆలమూరులో నూతన పీహెచ్‌సీ భవనం ప్రారంభం
- పాల్గొన్న గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి
- అభివృద్ధిని చూసి ఆదరించండి
- టీడీపీ నాయకుల మాటలు నమ్మొద్దు



ఆలమూరులో పీహెచ్‌సీ నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ పోచా, గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

రుద్రవరం: పేదల ఆరోగ్యాన్ని సంరక్షించేందుకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య రంగానికి పెద్ద పీట వేసిందని ఏపీ జలవనరుల శాఖ ప్రభుత్వ సలహాదారుడు గంగుల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆలమూరులో ప్రభుత్వం రూ.1.85 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని శుక్రవారం డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందారెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి కలిసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఆలమూరులో అన్ని సౌకర్యాలతో నూతన భవనం నిర్మించినట్లు తెలిపారు. ఎంపీపీ బాలస్వామి, జెడ్పీటీసీ మాధవి, పుట్టాలమ్మ క్షేత్ర డైరెక్టర్ గంగిశెట్టి తిమ్మయ్య, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, ఎంపీటీసీ మీరాంబీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రసాదరెడ్డి,నాయకులు పత్తి లక్ష్మీనారాయణ,నాగేష్,చంద్ర, బ్రహ్మయ్య, శూలం ప్రభాకర్, రహీం, వెంకటేష్, మాధవ, శుద్దుల కృష్ణుడు,వైద్య సిబ్బంది ఉన్నారు.

బ్రిడ్జి నిర్మించి మాట నిలబెట్టుకున్నాం



ఆర్.పాంపల్లెలో వంతెన నిర్మాణానికి స్థలం ఇచ్చిన దాతలతో ప్రజాప్రతినిధులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామ సమీపంలో కుందరవాగుపై రూ.5 కోట్లతో బ్రిడ్జిని నిర్మించి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, రాష్ట్ర జల వనరుల శాఖ ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో రూ. 1.85 కోట్లతో నూతనంగా నిర్మించిన 24 గంటల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, కుందరవాగుపై వంతెనను ప్రారంభించారు. కార్యక్రమానికి వీరితో పాటు జెడ్పీటీసీ సభ్యురాలు కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సర్పంచ్ మేకల ఓబులేస్ హాజరయ్యారు. అనంతరం బ్రిడ్జిని పరిశీలించారు. డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, ఏఓ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యాధికారులు వెంకటసుబ్బయ్య, అపర్ణ, ఆర్‌అండ్‌బీ డీఈ సునీల్‌రెడ్డి, పంచాయతీ రాజ్ డీఈలు వెంకటసుబ్బయ్య, లక్ష్మినరసింహులు, విశ్రాంతి ఏఈ కరీం బాషా, ఎంపీటీసీ సభ్యులు గగ్గెర వెంకటేశ్వర్లు, కపురం శివమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు పోచా వెంకటరెడ్డి, నాయకులు కపురం శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యం



మహిళకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

గోస్పాడు: కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకొని కరపత్రాలను అందచేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం నాయకులు ఎన్నికల సమయంలో మాత్రమే వచ్చి తప్పుడు ప్రచారాలతో ప్రజలను మోసం చేయడానికి యత్నిస్తారని, వారికి బుద్ధి చెప్పాలని కోరారు. ఉప సర్పంచ్ బొక్కెం నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, సత్యనారాయణ, నాగేంద్ర, జగదీష్, శివకృష్ణ, సదాశివరావు, రామయ్య పాల్గొన్నారు.

ఆలయాల్లో స్వచ్ఛభారత్

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలో శ్రీరామజన్మ భూమి తీర్థ ట్రస్టు, సంఘమిత్ర ఆధ్వర్యంలో పలు దేవాలయాలను శుక్రవారం శుభ్రం చేశారు. చిలుకూరి శ్రీనివాస్, రాంప్రసాద్ మాట్లాడుతూ పట్టణంలోని పెద్దబండ వద్దనున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం, నూనెపల్లె హరిజనపేటలోని శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయాల పరిసరాలను, ఉత్సవమూర్తి విగ్రహాలను తదితర వాటిని శుభ్రం చేశామన్నారు. నాగరాజయ్య, శ్రీనివాస్‌పాండే, నారాయణ, రమణయ్యగౌడ్, శేషగిరిరావు పాల్గొన్నారు.

గడ్డివాముల దగ్ధం

చాగలమర్రి: మండలంలోని గొడిగనూరు గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని రెండు గడ్డివాములు కాలిపోయాయి. దీంతో ఇద్దరు రైతులకు రూ.80 వేల నష్టం వాటిల్లింది. బాధితుల వివరాల మేరకు..గ్రామానికి చెందిన తలారి చిన్నయ్య, పురుషోత్తంకు చెందిన గడ్డివాములు ప్రమాదవశాత్తు నిప్పంటుకొని కాలిబూడిదయ్యాయి. సమాచారం అందుకున్న ఆళ్లగడ్డ అగ్నిమాపక దళ అధికారి వీరారెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు.

దుకాణాల వేలంలో ఆదాయం



నూనెపల్లె మటన్ షాప్‌నకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

నంద్యాల(సిటీ): పట్టణంలోని పలు ప్రాంతాలలోని 32 దుకాణాలకు సంబంధించి శుక్రవారం బహిరంగ వేలంను మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు ఆధ్వర్యంలో నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ సెక్షన్‌లో నిర్వహించిన వేలంలో 6 దుకాణాలను దక్కించుకునేందుకు మాత్రమే వ్యాపారులు ముందుకు రాగా.. మిగిలిన దుకాణాల వేలం వాయిదా పండిందని ఇన్‌చార్జ్ ఆర్ఓ వెంకటకృష్ణ తెలిపారు. ఆర్ఓ మాట్లాడుతూ ఆరు దుకాణాలకు సంబంధించి గతానికంటే అధిక మొత్తంలో ఆదాయం సమకూరిందన్నారు. ముఖ్యంగా ఎన్టీఆర్ కాంప్లెక్స్‌లోని గతంలో నెలకు రూ.6వేలు బాడుగ చెల్లించేవారని ప్రస్తుతం ఓ దుకాణం రూ.26వేలకు పాటదారుడు దక్కించుకున్నారన్నారు. అలాగే ఇదే కాంప్లెక్స్‌లో రూ.22వేలకు మూడు దుకాణాలు రూ.22,500కు మరో దుకాణం, రూ.26 వేలకు ఒక దుకాణాన్ని పాటదారులు దక్కించుకున్నారని దీంతో మున్సిపాలిటీకి అధికంగా ఆదాయం లభించింది. ఇక నూనెపల్లెలోని మటన్ షాప్ గతంలో రూ.4వేలు అద్దె చెల్లించే వారని, ప్రస్తుతం రూ.5వేలకు దక్కించుకున్నారని వివరించారు. వాయిదా పడిన దుకాణాల వేలంలో పాల్గొనదలచే వ్యాపారులు సాల్వెన్సీ, గుడ్‌విల్, డిపాజిట్‌లతో పాటు అన్ని రకాల ధ్రువపత్రాలతో పాల్గొనాలని కోరారు. ఆర్ఐ గులాంహుస్సేన్, యుగంధర్, సిబ్బంది ఉన్నారు.

జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి కొనసాగింపు



ఉయ్యాలవాడలో మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గంగుల

ఉయ్యాలవాడ : రాబోయే రోజుల్లో సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉయ్యాలవాడలో రెండవ రోజు ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి, ఎంపీటీసీ గగ్గెర వెంకటేశ్వర్లు, సర్పంచ్ మేకల ఓబులేస్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుడ్డా చంద్రమోహన్‌రెడ్డి, గ్రామ నాయకులు ముసాని శివానందరెడ్డి, ఖాతా దస్తగిరిరెడ్డి, కొట్టాల భాస్కర్‌రెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడి పథకాల అమలు, వలంటీర్ల పనితీరు, జగనన్న పాలనపై అడిగి తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. సహాయం అందుకున్న వారంతా జగనన్నకు మద్దతుగా నిలవాలని అభ్యర్థించారు. తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్డీ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గజ్జెల క్రిష్టారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ లాలమ్మగారి హుసేనయ్య, సింగిల్‌విండో అధ్యక్షులు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, పోచా వెంకటరెడ్డి, కసాని రవీంద్రనాథ్‌రెడ్డి, రామమద్దిలేటిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆరికట్ల శివరామకృష్ణారెడ్డి, చెన్నూరు భాస్కర్‌రెడ్డి, నాయకులు ఎర్రి శ్రీనివాసరెడ్డి, కూలూరు రామకృష్ణారెడ్డి, కసాని ప్రతాప్‌రెడ్డి, కపురం శ్రీనివాసరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

క్రీడా పోటీలు

నంద్యాల(అర్బన్): ఆడుదాం ఆంధ్ర బ్యాడ్మింటన్ పోటీల్లో భీమవరం, పాండురంగాపురం జట్లు సత్తా చాటి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. స్థానిక నంది ఇండోర్ స్టేడియంలో శుక్రవారం పీఈటీ గోపికృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఎంపీడీఓ సుగుణశ్రీ ప్రారంభించారు. బెస్ట్ ఆఫ్–3 పద్ధతిలో నిర్వహించిన పురుషుల పోటీల్లో భీమవరం, పెద్దకొట్టాల జట్లు తలపడగా భీమవరం రెండు సెట్లలో 21–15, 21–14 తేడాతో విజయం సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికైంది. అలాగే మహిళల విభాగంలో పాండురంగాపురం జట్టు పోలూరు జట్టుపై 21–15 తేడాతో విజయం సాధించి నియోజకవర్గస్థాయి పోటీలకు ఎంపికైంది.

నేడు గోవిందపల్లెకు ఎమ్మెల్యే రాక

శిరివెళ్ల: ఈ నెల 20వ తేదీన మండలంలోని గోవిందపల్లె, కామినేనిపల్లె, కోటపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఇందూరి ప్రతాపరెడ్డి శుక్రవారం తెలిపారు. గోవిందపల్లెలో రూ.50 లక్షలతో నిర్మించిన రోడ్లను ప్రారంభిస్తారన్నారు. రూ.5.50 కోట్లతో చేపట్టనున్న గోవింద పల్లె– ఇసుకపల్లె రోడ్డు నిర్మాణానికి భూమి పూజ, అలాగే కామినేనిపల్లెలో రూ.31 లక్షలతో వేసిన సీసీ రోడ్లు, ఘన వ్యర్థ పదార్థాల నిల్వ కేంద్రం, పైప్ లైన్, రూ.14 లక్షలతో వేసిన సిమెంట్ రోడ్లు, డ్రైనేజీని ప్రారంభిస్తారని వివరించారు.

నివాళి

దొర్నిపాడు: మండలంలోని క్రిష్టిపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పల్లె స్వామిరెడ్డి (86) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి గ్రామానికి చేరుకుని మృత దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు పల్లె ప్రసాద్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ఆలయ చైర్మన్ శివశంకర్‌రెడ్డిని పరామర్శించారు.

ముగిసిన మండలస్థాయి క్రీడా పోటీలు



రుద్రవరంలో క్రీడా సామగ్రి అందజేస్తున్న ఎంపీడీఓ



నంద్యాలలో బ్యాడ్మింటన్ ఆడుతున్న దృశ్యం

రుద్రవరం: స్థానిక జెడ్పీఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి పోటీల్లో సత్తా చాటి అసెంబ్లీ స్థాయి పోటీలకు ఐదు జట్లు ఎంపికయ్యాయి. ఆయా జట్లకు ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి క్రీడా సామగ్రి అందజేశారు. ఆయన మాట్లాడుతూ కబడ్డీ పోటీలకు పెద్దకంబలూరు జట్టు, క్రికెట్‌లో రుద్రవరం–3, బ్యాడ్మింటన్‌లో రుద్రవరం–3, వాలీబాల్‌లో రుద్రవరం–1 , ఖోఖోలో ఎర్రగుడిదిన్నె జట్లు అసెంబ్లీ సెగ్మెంట్ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయని తెలిపారు.

ఉయ్యాలవాడ : మండలంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో భాగంగా మండల స్థాయి క్రికెట్ పోటీలు రెండవ రోజు కొనసాగాయి. ఇంజేడు, ఆర్.జంబులదిన్నె, సుద్దమల్ల, హరివరం, అల్లూరు, తుడుమలదిన్నె సచివాలయాల పరిధిలోని జట్లు తలపడ్డాయి. పంచాయతీ కార్యదర్శి జయరామిరెడ్డి, నూర్‌బాషా, విజయదీప్తి, పరిపాలనాధికారి పార్థసారథి పాల్గొన్నారు.

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామంలో శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. జూలేపల్లె, యాళ్లూరు–1 సచివాలయం జట్ల మధ్య పోటీలో యాళ్లూరు జట్టు గెలుపొందింది. ఈ జట్టులోని భరత్‌కుమార్ 78 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. దీబగుంట్ల, జిల్లెల్ల సచివాలయ జట్ల మధ్య పోటీ జరగగా దీబగుంట్ల జట్టు విజయం సాధించింది. ఒంటివెలగల, సాంబవరం సచివాలయాల జట్ల మధ్య పోటీలో సాంబవరం జట్టు గెలుపొంది ఫైనల్‌కు చేరినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు తెలిపారు.

చాగలమర్రి: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని జిల్లా జేసీఎస్ కో–ఆర్డినేటర్ షేక్ బాబులాల్, ఎంపీపీ వీరభద్రుడు, చక్రం షబ్బీర్‌అహ్మద్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జి.కుమార్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముల్లా ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఎంపీడీఓ మహబూబ్‌దౌలా ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన మండల స్థాయి ఆడుదాం–ఆంధ్రా ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన చాగలమర్రి – 2 క్రికెట్ జట్టుకు రూ.5 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.3 వేలు, వాలీబాల్‌లో విజేత ముత్యాలపాడు జట్టుకు రూ.3వేలు, చాగలమర్రి– 2 జట్టుకు రూ.2 వేలు, కబడ్డీ విజేత శెట్టివీడు జట్టుకు రూ.3 వేలు, పెద్దబోధనం జట్టుకు రూ.2 వేలు, ఖోఖో పురుషుల విభాగం విజేత శెట్టివీడు జట్టుకు రూ.3 వేలు, చాగలమర్రి– 5 జట్టుకు రూ.2వేలు, ఖోఖో మహిళల విభాగం విజేత చిన్నవంగలి జట్టుకు రూ.2 వేలు, పెద్దబోధనం జట్టుకు రూ.1,500, బ్యాడ్మింటన్ పురుషుల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన చాగలమర్రి 5 జట్టుకు రూ.2 వేలు, మద్దూరు జట్టుకు రూ.వెయ్యి బహుమతులుగా అందజేశారు.

ఉపకార వేతనాల పంపిణీ

నంద్యాల(వ్యవసాయం): నంద్యాల దివ్యాంగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కార్యాలయంలో సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ అధ్యక్షతన ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నంద్యాలకు చెందిన ప్రముఖ ఆర్యవైశ్య నాయకుడు గోళ్లరాజేష్ సౌజన్యంతో ఆరుగురు దివ్యాంగ విద్యార్థులకు రూ.20వేలు పంపిణీ చేశారు. సంఘం నాయకులు రమణయ్య, వెంకటరావు పాల్గొన్నారు.

తెలుగువారు గర్వపడే కవి వేమన

నంద్యాల(వ్యవసాయం): తెలుగువారు గర్వపడే కవి వేమన అని మాతృ భాష పరిరక్షణ సమితి అధ్యక్షుడు డీవీ హయగ్రీవాచారి, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ రవీంద్రనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం మాతృభాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో స్థానిక కార్యాలయంలో యోగి వేమన జయంతిని నిర్వహించారు. ముందుగా వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సాహితీ వేత్తలచే యోగివేమన పద్యాలు–వ్యక్తిత్వ వికాసం అనే అంశాలపై సదస్సు నిర్వహించారు. రమణమూర్తి, శ్రీనివాసమూర్తి, అన్నెం శ్రీనివాసరెడ్డి, మద్దిలేటి, నీలకంఠేశ్వర్లు, డాక్టర్ కిశోర్‌కుమార్, శివారెడ్డి, సుబ్బయ్య పాల్గొన్నారు.